# గ్రూప్ స్టడీ మంచిది !



పిల్లలు ఎవరికి వారు చదువుకోవడం మామూలే. అలా కాకుండా గ్రూప్ స్టడీలో పాల్గొనడం వల్ల ప్రయోజనాలున్నాయి అంటున్నారు నిపుణులు. పిల్లలు ఒంటరిగా చదువుతున్నప్పుడు ఏదో మొక్కుబడిగా చదువుతూ బోర్‌గా ఫీలుతుంటారు. కొన్ని సబ్జెక్టులు ఇంకెప్పుడైనా చదువుదాం అని వాయిదా వేస్తుంటారు. అదే వారి స్నేహితులతో గ్రూప్ స్టడీ చేయండి అంటే చాలు ఎంతో ఉత్సాహం చూపిస్తారు. దీనివల్ల వాయిదా విధానాన్ని మానుకుంటారు.

◆ కలిపి చదవడంవల్ల వారిలో బృంద స్ఫూర్తి ఏర్పడు తుంది. మీ పిల్లలు సిగ్గు పడేవారైతే స్నేహితులతో చదవడమే మంచిది. సందేహాలను పంచుకోవడం వల్ల వాళ్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. బాల్యం నుంచే వారిలో నాయకత్వ లక్షణాలు అలవడతాయి.

◆ ఎవరికి వారు చదువుకునేటప్పుడు తాము చదివిందే కర్టెక్ అనుకుంటారు. దానివల్ల పరీక్షలో తప్పుడు సమాధానాలు రాస్తుంటారు. అదే గ్రూప్ స్టడీ చేయడం వల్ల తప్పొప్పులు సరిచూసుకోగలరు. అంతేకాదు, పిల్లలకు అన్ని సబ్జెక్టులూ సరిగా అర్థం కాకపోవచ్చు. అదే ఒకరికొకరు చెప్పుకోవడంవల్ల తేలికగా నేర్చుకుంటారు. □

# ఇల్లే ఒక వెల్‌నెస్ సెంటర్ !



ఇల్లే ఒక వెల్‌నెస్ సెంటర్ ! మనసు బాలే నప్పుడూ, శరీరం అలని సొలసిన ప్పుడూ... గుర్తొచ్చేవి వెల్‌నెస్ సెంటర్లూ, స్పాలూ, ప్రకృతి విహారాలూ. కానీ ఇంటి వాతావరణాన్నే ఆ విధంగా మార్చుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అదెలా అంటే..

✦ సువాసన, స్పర్శ, దృష్టి, ధ్వని, రుచి... ఇలా పంచేంద్రియాలను ఉత్తేజ పరిచే వాతావరణాన్ని ఇంట్లోనే సృష్టించవచ్చు. వీటితో ప్రశాంతత, సున్నితత్వం, సృజనాత్మకత సొంతమవుతాయి. విశ్రాంతి పొందడం, తేరుకోవడంలో సాయపడ తాయి.

✦ దైనందిన జీవితంలో చేసే పనులకు అనుకూలమైన వాతావరణం ఇంట్లో ఉండాలి. కృత్రిమమైన వస్తువులు కాకుండా పంచభూతాలకు సహజ పద్ధతిలో దగ్గరగా ఉండేలా పర్యావరణహితమైన వస్తువులు ఎక్కువగా ఉండాలి. బంకమట్టి వస్తువులు, నార వస్త్రాలు వంటి వాటిని తాకినప్పుడు మనసుతో మట్లాడినట్లు అనిపిస్తుంది. అందుకే ఇలాంటివాటికి ప్రాధాన్యత ఇవ్వాలి.


✦ ప్రకృతికి దగ్గరగా ఉండేలా ఇంటిని రూపొందించు కోవాలి. అప్పుడే ఆరోగ్యంగానూ ఉంటాం. మరో బాల్కనీలూ, వరండాలూ విశాలంగా, ఆహ్లాదకరంగా ఉండాలి. అక్కడ ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి.

✦ మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో రంగులది కీలకపాత్ర ఇల్లూ, ఇంట్లోని వస్తువులకు ఆకుపచ్చ, గులాబీ, లేత నీలం... వంటి రంగులను ఎంపిక చేసుకోండి. 5. ఇంట్లో ఎక్కడ పెడుతున్నామన్నదీ దీన్లో కీలకం. అక్కడ కూర్చుంటే సహజంగానే విశ్రాంతి పొందుతున్న అనుభూతి రావాలి. □

# మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఎందరో !

**మూడు దశాబ్దాల పోరాటం.. మహిళల చిరకాల స్వప్నం.. నేటికైనా అది నెరవేరాలన్నదే అందరి ఆకాంక్ష. అయితే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చడం వెనక కీలకపాత్ర పోషించిన వాళ్లలో మహిళా నాయకులూ కార్యకర్తలెందరో.. వాళ్లలో కొందరి గురించి తెలుసుకుందాం..**






**ప్రమీల దండావతే:** ముంబయికి చెందిన మాజీ ఎంపీ. 1980ల ప్రారంభంలో ఏడో లోక్‌సభలో ఈ బిల్లును ఓ ప్రైవేట్ సభ్యుని బిల్లుగా తొలిసారిగా ప్రవేశపెట్టారు. 1989లో వి.పి.సింగ్ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల విధాన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తొలిగా డిమాండ్ చేశారీమె. ఈ బిల్లుకోసంవివిధ రాజకీయ పార్టీల మహిళలతో కలిసి పనిచేశారీమె. 1970వ దశకంలోనే మహిళల హక్కులకోసం విశేషంగా కృషిచేశారు. వరకట్న నిరోధక, సతీసహగమన నివారణ చట్టాలను సవరించడానికి అవిశ్రాంతంగా శ్రమించారు. రాజకీయంగా ఎంతో చురుగ్గా ఉండే ప్రమీల... ఎమర్జెన్సీ కాలంలో 18 నెలల జైలు శిక్ష అనుభవించారు. మహిళా దక్షత సమితిని నెలకొల్పి జమీలా వర్గీస్, డాక్టర్ కుమారిలతోకలిసి 'విడోస్, అబాండ్ అండ్ డెడ్ డెడ్ విమెన్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని రచించారు.

**గీతా ముఖర్జీ:** కోల్‌కతాలోని మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారీమె. విద్యార్థి దశ నుంచీ ఉద్యమాల్లో పనిచేసేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తరవాత అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఎన్నోసార్లు జైలుకి వెళ్లారు. సీపీఐ నాయకురాలు, సుదీర్ఘకాలం ఎంపీగా ఉన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముఖర్జీ, రికార్డు స్థాయిలో ఏడు సార్లు పార్లమెంటుకి ఎన్నికయ్యారు. సీపీఐకి చెందిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్స్ ఆధ్యక్షురాలుగానూ పనిచేశారు. మహిళలకు మూడింట ఒకవంతు రిజర్వేషన్ కల్పించాలని డిమాండు ఆమె నాయకత్వం వహించారు. 1996లో సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షురాలుగా ఉన్న గీత...మహిళా బిల్లు రూపకర్త కూడా. బిల్లు తొలి అధికారిక ప్రతిని పరిశీలించి కీలకమైన సిఫార్సులను చేశారు.



అప్పట్లో మహిళలు రక్తంతో రాసిన వినతిపత్రాలు అందినప్పుడు ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. వాటిలో చాలా వరకు తుది బిల్లులో చేర్చారు. మహిళా బిల్లుకోసం అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేశారు గీతా ముఖర్జీ. మెజారిటీ సాధనకు ఆమె ఎంతో కృషి చేసినప్పటికీ ఏకాభిప్రాయం లేదనే సాకుతో ఇతర పార్టీలు వెనకడుగు వేసినప్పుడు ఆమె తీవ్ర నిరాశ చెందింది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నా భర్త చనిపోయినప్పుడు కూడా ధైర్యంగా ఉన్నాను. కానీ ఈ రోజు కన్నీళ్లు పెట్టు కున్నా అన్నారట. బిల్లుకోసం మంత్రి పదవినీ కాదన్న నిస్వార్థ రాజకీయకీయ నాయకురాలు గీత.

**డా. రంజనాకుమారి,:** ఉద్యమకారిణి, పండితురాలు, బిల్లు రూపాన్ని రూపొందించడంలో సాయపడ్డారు. ప్రస్తుత సెంటర్ ఫర్ సోషల్ రిసెర్చ్ ఇండియా డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ బిల్లుకోసం ప్రచారం చేసిన జాతీయ మహిళాసంఘాల సమూహమైన సెవెన్ సిస్టర్స్ నాయకత్వం వహించారు. మూడు దశాబ్దాల పోరాట ఫలం ఇది. 2023లో పార్లమెంటులోనే ఆమోదం పొందింది. కానీ, పునర్విభజన, జనాభా లెక్కలకు సంబంధించిన ప్రశ్నల కారణంగా ఇప్పటి వరకు అమలు కాలేదు. మన ప్రజాస్వామ్యానికి మహిళల భాగస్వామ్యం కేంద్రంగా ఉండాలని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆకాంక్షించారు. అది ఇంకా నెరవేరలేదు. పార్లమెంటులో సమానత్వం కోసం పోరాడిన మహిళలు, మహిళా సంఘాలు అంతా ఒక్కటే బిల్లును ఆమోదించండి. 2029 నాటికి లోక్ సభలో 33 శాతం మంది మహిళలను చూడండి అంటున్నారు రంజ.



**వీళ్లే కాదు,** 1987లో 14 మంది సభ్యుల కమిటీకి నాయకత్వం వహించిన మార్గరెట్ అల్వా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని అధికారికంగా సిఫార్సు చేసిన వ్యక్తి. ఈ బిల్లుకు గట్టి మద్దతు ప్రకటించి, అన్ని పార్టీల మద్దతు కూడగట్టడంలో కీలకపాత్ర పోషించారు. సుష్మా స్వరాజ్. యూపీఏ హయాంలో ఈ బిల్లు ఆమోదం కోసం నిరంతరం కృషి చేసి 2010లో రాజ్యసభలో అది ఆమోదం పొందేలా చేశారు సోనియా గాంధీ... ఇలా మరెందరో. మహిళల్ని ప్రజాపాలనలో చూడాలని ఎంతో శ్రమించిన నాయకురాళ్లలో కొందరు నేడు లేకపోవచ్చు. కానీ వాళ్ల పోరాటం, ఉద్యమస్ఫూర్తి భావితరాలకు ఆదర్శనీయమే కదూ. □

# అరిషడ్వర్గాలు

అరిషడ్వర్గాలు. కామ క్రోధ లోభ మోహ మద మాత్స ర్యాలు అంతశ్శత్రువులు. మహిషుడి నుంచి మనుషుల వరకూ వాటి చేతిలో ఓడనివారు ఉండరు. సకలశాస్త్ర కోవిదు డైనప్పటికీ కామం వల్ల రావణుడు ఎందరో స్త్రీలను చెరబట్టి కోరి వినాశనాన్ని తెచ్చు కున్నాడు. క్రోధంవల్ల విశ్వామిత్రుడు వశిష్టుని వందమంది కుమారులను వధించి తీవ్ర పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. ఐదు ఊళ్లైనా ఇవ్వమని అడిగిన పాండుపుత్రుల అభ్యర్థ నను లోభంతో తిరస్కరించాడు దుర్యోధనుడు. అది కురుక్షేత్రానికి దారితీసింది. శుంభనిశుంభులు అన్యోన్య సోదరులు. స్త్రీ వ్యామోహం వారి ఎడబాటుకే కాదు చావుకు కారణమైంది. కార్తవీర్యార్జునుడనే రాజు తలకెక్కిన మదం వల్ల పరశురాముడి చేతిలో 21 సార్లు భూమండలం మీదున్న రాజవంశాలు అంతమయ్యాయి. శ్రీకృష్ణభగవానుడి వైభవాన్ని చూసి మత్సరంతో రగిలిపోయాడు శిశుపాలుడు. నూరు తప్పులు దాటాక.. శిక్ష పొందాడు. దైవం పట్ల నిరంతర కృతజ్ఞతాభావం చూపాల్సిన మనసును కలుషితంచేసేదే ఈ అరిషడ్వర్గం. సానుకూల దృక్పథం, ప్రకృతి పట్ల ప్రేమ, ధర్మాచరణ ఈ శత్రుమూకను తరిమేసి విజయాన్ని చేకూర్చగలవు. మెరికా తనకు భిక్ష వేసిన గృహిణి పట్ల అర్థమైంది బాలశంకరుల హృదయం. నిస్వార్థ భక్తితో అమ్మవారినిస్తుతించగా.. ఆయన వాక్కు అధీనమై కనకధారలనుకురిపించింది. జగన్మాత. కంచికి చెందిన మహా భక్తుడైన మూకశంకరులు ధర్మప్రవర్తనతో తదేకదీక్షతో ఆ దేవిని ధ్యానించి, దర్శించి ధన్యమయ్యారు. □

నేనే కర్తను, ఈ పనిని నేనే చేశాను, సర్వసమర్థుణ్ణి లాంటి అహంకారపూరిత ఆలోచనలతో మనిషి తనకు తానుగా బందీ అవుతున్నాడు. 'మోహ మూలం అహంకారః' అన్నది ఉపనిషత్తు వాక్యం. ఆ అహంకారా నికి పుట్టినవే

# కరివేపాకు పానీయం



పండ్లతోనే కాదు కాయగూరలతోనూ కాన్సన్ట్రేట్ డ్రింక్ తయారుచేయొచ్చు. కరివేపాకుతో చిక్కటి పానీయం చేసి నిలవుంచు కుంటే. ఎప్పు డంటే అప్పుడు తాగొచ్చు.

**కావలసినవి:** కరివేపాకు రెండు కప్పులు, నిమ్మరసం 2 స్పూన్లు, జీలకర్ర టేబుల్ స్పూన్లు, మిరియాలు స్పూన్, అల్లం తరుగు రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు రుచికి తగినంత, బెల్లంపొడి కప్పు, నెయ్యి స్పూన్, ఇంగువ చిటికెడు

**తయారీ:** కరివేపాకును కడిగి, వస్త్రం మీద ఆరబెట్టాలి. కడాయిలో జీలకర్ర, మిరియాలను వేయించాలి. చల్లారాక.. కరివేపాకు, అల్లం, కప్పు నీళ్ల జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని మందమైన గిన్నెలోకి తీసి.. సన్న సెగ మీద వేడి చేయాలి. ఆరేడు నిమిషాల తర్వాత బెల్లంపొడి, ఉప్పు, ఇంగువ, నెయ్యి వేసి కలియబెడుతూ ఉడికించాలి. మిశ్రమం చిక్కగా అయ్యాక స్టవ్ ఆఫ్ చేయాలి. పూర్తిగా చల్లారిన తర్వాత నిమ్మరసం కలపాలి అంతే.. ఆరోగ్యకరమైన పానీయం సిద్ధమవుతుంది. పూర్తిగా చల్లారాక.. శుభ్రమైన సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే రెండు నెలలు నిల్వ ఉంటుంది. తాగదలచి నప్పుడు గ్లాసు చల్లని నీళ్లలో రెండు స్పూన్ల కాన్సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. మిశ్రమాన్ని ఇంకొంచెం చిక్కబడేట్లు ఉడికించాలి.ఇది మూడు నుంచి నాలుగు వారాలు నిల్వ ఉంటుంది. ఈ పానీయం జీర్ణశక్తిని పెంచు తుంది, రక్తహీనతను తగ్గిస్తుంది. కురులను సంరక్షిస్తుంది. □

# అన్నం.. కూర.. పప్పు ఒకేసారి!



యుద్ధం కారణంగా ఎల్పీజీ కొరతతో వంటకు ప్రత్యామ్నాయాలు వెతుక్కోక తప్పడం లేదు. ఇప్పటికే ఇండక్షన్ కుక్‌టాప్ వాడకం పెరిగింది. కానీ కరెంటు మాటేంటి... అసలే వచ్చేది వేసవికాలం, ఏసీల వాడకమూ పెరుగుతుంది. దాంతో విద్యుత్ బిల్లులు బారెడు వస్తాయి కదా! గ్యాస్, విద్యుత్ సరఫరానీ ఆదా చేయాలంటే మాత్రం మల్టీ పర్పస్ స్మార్ట్ రైస్ కుక్కర్ ఉండాల్సిందే. సాధారణ రైస్ కుక్కర్లో కాకుండా ఇందులో ప్రెషర్ కుక్కర్, స్టీమర్... వంటి ఎంపికలు ఉంటాయి. దాంతో అన్నం, పప్పు, కూరలను ఒకేసారి వండేసుకోవచ్చు. స్టీల్ లేదా నాన్‌స్టిక్ పాత్రలతో వస్తుంది. కుక్కర్లో దిగువ భాగంలో పప్పు, కూరలను పెట్టుకోవచ్చు. స్టీమర్ బాస్కెట్‌లో రైస్ ను పెట్టుకునేలా దీన్ని తయారుచేశారు. కింద ప్రెషర్తో పప్పు, కూరలు ఉడుకుతుంటే... స్టీమ్ అన్నం ఉడుకుతుంది. ఈ ఆహార పదార్థాలు కలవకుండా అన్నీ ఒకేసారి సిద్ధిస్తాయి. 2030 నిమిషాల్లోనే వంట పూర్తవుతుంది. గ్యాస్ వాడకమూ తగ్గుతుంది. శుభ్రం చేయడం కూడా సులువే అయితే స్మార్ట్ కుక్కర్ కొనేటప్పుడు కుటుంబానికి సరిపోయేలా స్టెయిన్లెస్ పాత్ర ఉన్న రకాలను ఏంచుకుంటే, మేలు. □

తెర

# 'గద్దర్ అవార్డ్'' ఉత్తేజంతో రెండో చిత్రం ప్రారంభం

**- నిర్మాత బూసం రవీంద్రనాథ్**




"మనం చెట్లను కాపాడితే... చెట్లు మనల్ని కాపాడతాయి'' అనే సిద్ధాంతంతో చెట్లు నాట డానికే తన జీవితాన్ని అంకితం చేసి, "చెట్ల రామయ్య'' అలియాస్ 'వనజీవి రామయ్య'గా తన జన్మను ధన్యం చేసుకుని, భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక "పద్మశ్రీ'' పురస్కారం పొందిన దరిపల్లి రామయ్య జీవితానికి "వనజీవి రామయ్య'' పేరుతో దృశ్యరూపం ఇచ్చారు నూతన నిర్మాత బూసం రవీంద్రనాథ్. 'వృక్షో రక్షతి రక్షిత' అనే ట్యాగ్ లైన్‌తో నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో బి. ఆర్. మూవీస్ బ్యానర్ పై రవీంద్రనాథ్ నిర్మించిన ఈ 40 నిమిషాల నిడివి కలిగిన లఘు చిత్రం... షార్ట్ ఫిలిమ్స్ కేటగిరీలో ఫస్ట్ బెస్ట్ షార్ట్ ఫిల్మ్‌గా తెలంగాణ ప్రభుత్వం నుంచి గద్దర్ అవార్డు దక్కించు కుంది. 5 లక్షల నగదు బహుమతి కూడా అందుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల దృష్టిని ఆకర్షించింది!! నిర్మాతగా తన తొలి ప్రయత్నమే ఫలప్రదం కావడంతో... త్వరలో రెండో చిత్రానికి శ్రీకారం చుడుతున్నారు. సినిమాలంటే చిన్నప్పటి నుంచి మహా ఇష్టం. ఆ ఇష్టంతోనే "వనజీవి రామయ్య'' చిత్రంలో ఒక చిన్న పాత్ర సైతం పోషించారు. ప్రస్తుతం తన రెండో చిత్రం కోసం కథాచర్చలు జరుపుతున్న రవీంద్ర త్వరలో ఈ చిత్రాన్ని సెట్స్‌కి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. "వనజీవి రామయ్య''గా టైటిల్ రోల్‌తో మెప్పించిన సీనియర్ నటుడు బ్రహ్మాజీతోపాటు ఈ చిత్రం రూపకల్పనలో దర్శకనిర్మాతలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# 'పెద్ది' జూన్‌లో ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ప్రమోషనల్ కంటెంట్‌తో మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేస్తోంది. విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి, రెండు గ్లింప్స్‌లలో రామ్ చరణ్ డిఫరెంట్ అవతార్స్ లో కనిపించి అందరినీ ఆకట్టు కున్నారు. ముఖ్యంగా, పుట్టినరోజు ప్రత్యేక గ్లింప్స్‌కు ఎక్స్ ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం విడుదల దిశగా ముందుకు సాగుతోంది. సినిమా విడుదల వాయిదా పడినట్లు చిత్ర బృందం ఇప్పుడు అధికారికంగా ధృవీకరిం చింది. మేకర్స్ నుండి వచ్చిన ఒక అధికారిక ప్రకటన ప్రకారం 'పెద్ది' జూన్‌లో థియేటర్ల లోకి రానుంది. సినిమా ఎడిటింగ్‌ను సమీక్షించిన తర్వాత, అవుట్‌పుట్ పై గొప్ప సంతృప్తిని వ్యక్తం చేశారు, అబ్సల్యూట్ పర్ఫెక్షన్ కోసం పోస్ట్‌ప్రొడక్షన్‌కు అదనపు సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. ప్రేక్షకులకు అత్యుత్తమమైన, గ్రేట్ థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి అద్భుతమైన తారాగణం కీలక పాత్రలలో నటిస్తున్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' టీజర్ లాంచ్



దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం ఇంటెన్స్ లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం' దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణమనవడు, మహేష్‌బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'ఉయ్యి అమ్మ' పాటతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆమె ఈ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. కలెక్షన్ కింగ్ డా.మోహన్ బాబు ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనున్నారు. అశ్వినిదత్ సమర్పణలో, పి. కిరణ్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రధాన తారాగణం ఫస్ట్‌లుక్ పోస్టర్ల విడుదలతోనే ఇప్పటికే ఆసక్తి రేకెత్తింది. ఈ రోజు, సూపర్ స్టార్ మహేష్‌బాబు ఈ టీజర్‌ను లాంచ్ చేశారు. తిరుపతి దేవాలయ పట్టణంలో సాగే ఈ కథ వాసుబాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారి ఆనందంగా జీవించే ప్రయాణాన్ని చూపిస్తుంది. తన ఇంటెన్స్, రాజీ పడని స్టోరీ టెల్లింగ్‌కి పాపులర్ అయిన అజయ్ భూపతి, ఈ చిత్రంలో యూత్‌ఫుల్ లవ్ స్టోరీని యాక్షన్, భావోద్వేగాలతో మిళితం చేశారు. జయకృష్ణ ఘట్టమనేని తన తొలి చిత్రానికే అద్భుతమైన మెచ్యూరిటీతో నటించారు. ఎమోషన్స్, ఇంటెన్స్, యాక్షన్, స్క్రీన్ ప్రెజెన్స్ అన్నింటినీ బ్యాలన్స్‌గా చూపిస్తూ ఆకట్టుకున్నారు.

# 'రావు బహదూర్' సాంగ్ లాంచ్ ఈవెంట్




సూపర్‌స్టార్ మహేష్‌బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తోంది. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్మరణ్ సాయి మృదువైన స్వరాలతో, ఆహ్లాదకరమైన నేపథ్యంతో ఈ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. విజయ్ యేసుదాస్ తన హృద్యమైన వోకల్స్‌తో ఈ పాటను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఈ చిత్రానికి కార్తిక్ పార్మర్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందించారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు వెంకటేష్ మహా మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ చాలా స్పెషల్. దాదాపు ఐదేళ్ళ తర్వాత నా సినిమాకి జరుగుతున్న తొలి ఈవెంట్ ఇది. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ.. 'ఓ సుందరి'పాట వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. నేను సినిమాలకు వచ్చిన కొత్తలో కమల్ హాసన్ లాంటి పాత్రలు ఎప్పుడైనా వస్తుందా అని అనుకునేవాడిని. ఒక రోజు వెంకటేష్‌మహా ఈ కథ చెప్పారు. సింగర్ విజయ్ యేసుదాస్ మాట్లాడుతూ.. ఇంత అద్భుతమైన ప్రాజెక్టులో భాగం కావడం ఆనందంగా ఉంది.

# 'పోచమ్మ' సక్సెస్ మీద మాకు నమ్మకం: కవిత



ఈనెల 17వ తేదీ నుంచి తెలుగు, తమిళంలో స్ట్రీమింగ్‌కు వస్తున్న 'పోచమ్మ' వెబ్ సిరీస్ ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా మరో సరికొత్త వెబ్ సిరీస్ 'పోచమ్మ' ను సబ్ స్క్రైబర్స్ ముందుకు తీసుకొస్తోంది. మిస్టికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ లో అంబటి అర్జున్, రమేశ్ ఇందిర, ప్రియ శతమర్షన్, స్నేహల్ కామత్, శృతి నాయుడు, శ్రీ పూజ, కీలక పాత్రల్లో నటించారు. 'పోచమ్మ' వెబ్ సిరీస్ ఈ నెల 17వ తేదీ నుంచి ఆహాలో తెలుగు, తమిళంలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. గోల్డ్ సబ్ స్క్రైబర్స్ 24 గంటల ముందుగా యాక్సెస్ పొందవచ్చు. నటి స్నేహల్ కామత్ మాట్లాడుతూ 'పోచమ్మ' వెబ్ సిరీస్ జెస్సీ అనే క్యారెక్టర్‌లో నటించాను. ఈ సిరీస్ షూటింగ్ మొత్తం చిక్ మంగళూరులో చేశాం. ఈ సిరీస్‌కు నన్ను సెలెక్ట్ చేసుకున్న ప్రొడ్యూసర్ శృతి నాయుడుకి థ్యాంక్స్ నటి శ్రీ పూజ మాట్లాడుతూ ఈ వెబ్ సిరీస్‌లో నటిస్తున్న మొదటి రోజే తప్పకుండా సక్సెస్ అవుతుందని నమ్మాను. ఆహా ఓటీటీ కంటెంట్ హెడ్ కవిత మాట్లాడుతూ 'పోచమ్మ' కథ విన్నప్పుడే ఈ సిరీస్ సక్సెస్ మీద మాకు నమ్మకం ఏర్పడింది.

# 'పవర్‌పేట' పవర్ ఫుల్ పోస్టర్



నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రతిష్టాత్మక బ్యానర్ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ కంటెంట్‌బేస్డ్ సినిమాలకు మద్దతు ఇవ్వడంలో పేరు సంపాదించుకుంది. ఇప్పుడు వారు మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. అర్థవంతమైన, బలమైన కథలను ఎంచుకోవడంలో పేరుపొందిన హీరో సందీప్ కిషన్, చిత్ర పరిశ్రమలో 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఒక మైలురాయిని చేరుకున్నారు. 'పవర్ పేట' అనే టైటిల్ ఆసక్తికరంగా ఉంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్ కూడా బలమైన ఇంప్రెషన్‌ను ఇస్తోంది. డార్క్, గ్రిట్టీ, సింబాలిజంతో నిండిన ఈ పోస్టర్‌లో రక్తంతో తడిసిన చెస్ బోర్డు కనిపిస్తుంది. ఇది వ్యూహం, శక్తి, త్యాగాన్ని సూచించే క్లాసిక్ ప్రతీక. చెస్ పీసులు విరిగిపోయినవి, కూలిపోయినవి, అస్థిర విజయంతో నిలబడినట్లు కనిపిస్తాయి. దర్శకుడు కృష్ణ చైతన్య విభిన్న జానర్లను కలిపి ఒక పవర్ ఫుల్ కథను రూపొందించారు. సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. కథతో పాటు టెక్నికల్ గా కూడా పవర్ పేట్ట బలంగా నిలుస్తోంది. సంగీతాన్ని మణిశర్మ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను మధీ నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. రామకృష్ణ, మోనిక ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే పోస్టర్‌తో 'పవర్ పేట' ఒక పవర్ ఫుల్ కథకు వేదిక సిద్ధం చేస్తోంది. భావోద్వేగాలు, పవర్ రాజకీయాల మధ్య జరిగే పోరాటాన్ని చూపించే ఈ చిత్రం పై మంచి అంచనాలు నెలకొన్నాయి. సినిమా గురించి మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

